

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

వానాకాలం సాగుకు కావాల్సిన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వరంగల్ జిల్లా రీజినల్ మేనేజర్ రఘు తెలిపారు. - 8లో



సమగ్ర వికాసానికి శాలసిద్ధి

పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా శాలసిద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ విద్యాసం వత్సరం నుంచి అమలు చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. - 8లో

గరిష్టం/కనిష్టం
44.4°/25.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండలు దంచికొడుతాయి. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యమకారులను విస్మరించడం తగదు



నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించి దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో ఆదివారం సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తూ, తెలంగాణ ఉద్యమకారులను, పలు సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమంలో కీలకంగా పని చేసిన ఉద్యమకారులను గుర్తించి గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ పార్టీగా ఇతర ప్రాంతంలో నష్టపోయినప్పటికీ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక తెలంగాణ సాధనలో ముందుండి పోరాటాలు నిర్వహించిందన్నారు. ఆర్టీసీ, సింగరేణి, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ ఉద్యమానికి ఊపిరిపోసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రాన్ని సాధించేందుకు రైలురోకో, రాస్తారోకో, సకల జనుల సమ్మె, సాగరహారం, వంటావార్పు, రహదారుల దిగ్బంధం వంటి కార్యక్రమాలను నిర్వహించి అనేక కేసులు, నిర్బంధాలను ఎదుర్కొని సీపీఐ నాయకులు ముందు వరుసలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఉత్సవాల్లో భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, పాండురంగాచారి, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, పోగుల శ్రీనివాస్, రేషపల్లి నవీన్, నెల్లూరి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చేప ఉత్పత్తుల ఆహార మేళా

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో జూన్ 8 నుంచి 10వ తేదీ వరకు చేప ఉత్పత్తుల ఆహారమేళా (ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి ఆదివారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాలో పది స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ రకాల చేపల, రొయ్యల ప్రత్యేక వంటల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ మేళాలో అనుభవం, ప్రత్యేక శిక్షణ పొందిన వారు స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద విజయ డెయిరీ ఉత్పత్తులతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేయబడుతుందని, ఫెస్టివల్‌కు వచ్చే వినియోగదారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పండుగను తలపించే విధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, జిల్లాకు చెందిన మత్స్యకారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సండే సందడి



వెంకటాపురం(ఎం)/ఎస్ఎస్ తాడ్వాయి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయం, మేడారం వనదేవతల సన్నిధికి సందర్శకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కావడంతో చిన్నారులు, పెద్దలు తరలివచ్చి సందడి చేశారు. వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వేలాది సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ విజయ్ కుమార్, వెంకటేష్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు.

మేడారానికి వేలాదిగా భక్తులు

మేడారం సమ్మక్క– సారలమ్మను దర్శించుకునేందుకు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జంపన్నవాగులో షెవర్ల వద్ద స్నానాలు ఆచరించిన అనంతరం తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, ఎత్తుబంగారం, చీరసారె, కానుకలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజును దర్శించుకున్నారు.

పుస్తకాలొచ్చాయ్..

- జిల్లాకు చేరిన 2,37,200 పాఠ్యపుస్తకాలు
- మండలాలకు తరలించేందుకు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలల్లో 1,06,829 మంది విద్యార్థులు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన పుస్తకాలు అందజేయనున్నాయి. ఈ మేరకు 2,37,200 పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి జూన్ 4వ తేదీన బడిబాట కార్యక్రమంనిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా జూన్ ఒకటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 10జీపీఏ, 9.8, 9.5జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానిస్తూ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న ప్రతీ విద్యార్థికి పుస్తకాలను అందజేయడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. కాగా జిల్లాకు 2,37,200 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పాఠ్యపుస్తకాలపై సీరియల్ నంబర్లు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డు నంబర్‌ను అనుసంధానం చేసుకుని, పుస్తకంపై ఉన్న సీరియల్ నంబర్‌ను రిజిస్టర్‌లో రాసుకుని, ఆధార్‌కార్డు, సీరియల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. అలాగే జూన్ 4నుంచి 12వ తేదీ వరకు బడిబాట నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ప్రతీ పాఠశాలకు రూ.వెయ్యి చొప్పున నిధులు ఇచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలాల వారీగా పంపిణీ..

జిల్లావ్యాప్తంగా 18 మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలకు పుస్తకాలు తరలిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,06,829 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారు.

మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య

బయ్యారం	4,065	గూడూరు	6,884	మరిపెడ	10,814
చిన్నగూడూరు	1,252	ఇనుగుర్తి	2,428	నర్సింహులపేట	3,508
దంతాలపల్లి	4,017	కేసముద్రం	6,707	నెల్లికుదురు	4,268
డోర్నకల్	7,343	కొత్తగూడ	3,666	పెద్దవంగర	2,158
గంగారం	1,239	కురవి	5,701	సీరోలు	2,286
గార్ల	3,886	మానుకోట	23,208	తొర్రూరు	13,399

మొత్తం విద్యార్థుల సంఖ్య 1,06,829

సకాలంలో అందజేస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలను సకాలంలో అందజేస్తాం. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో నూతన అడ్మిషన్ల కోసం తమవంతు బాధ్యతగా తీసుకుని విద్యార్థులను చేర్పించాలి. ఇప్పటికే జిల్లాకు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. వాటిని మండలాల వారీగా మండల విద్యావనరుల శాఖ కార్యాలయాలకు తరలిస్తాం. – పి.రామారావు, డీఈఓ

నిప్పంటుకొని ధాన్యం దగ్ధం



కాలిపోయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

మహబూబాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని సుమారు 50 క్వింటాళ్ల ధాన్యం దగ్ధమైన ఘటన మహబూబాబాద్ మండలంలోని వేమునూరు, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఆదివారం జరిగింది. కేసముద్రం మండలంలోని సర్వాపురంతండా గ్రామానికి చెందిన లకావత్ కిషన్ పొలం వేమునూరు, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఉండగా.. 50 క్వింటాళ్ల వడ్లను పొలంలో కుప్పగా పోశాడు. కొంత దూరంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు అంటించడంతో ఆ మంటలు వ్యాపించి ధాన్యం కుప్పకు అంటుకున్నాయి. చేతికి వచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ ప్రమాదంలో ఆ రైతుకు రూ.1.20లక్షలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లింది. ధాన్యంతో పాటు గడ్డి మోపులు, వ్యవసాయ బావుల మోటార్లు, వాటి పైపులు కూడా మంటల్లో కాలిపోయాయని రైతులు తెలిపారు.

పథకాల రూపంలో ప్రతి ఇంట్లో కేసీఆర్

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఇంట్లో సీఎం కేసీఆర్ ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని చీకటాయపాలెం, చెర్లపాలెం, గోపాలగిరి, కర్కాల, అమర్‌సింగ్ తండా, దుబ్బతండా, అరిపిరాల గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాల పాలనలో గ్రామాలన్నీ అధ్వానంగా మారడంతో పాటు అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రైతులు, అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందారని చెప్పారు. ఇలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, రైతు సమతి మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సీతారాములు, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్‌రావు, సీనియర్ నాయకులు కిషోర్‌రెడ్డి, చంద్రయ్య, సర్పంచ్‌లు నాగలక్ష్మి, సరోజన, మమతరెడ్డి, శ్రీనివాస్, సురేఖ, ఎంపీటీసీలు శ్యాంసుందర్‌రెడ్డి, గోపమ్మ, అలివేలు, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు

- మరిపెడ మున్సిపాలిటీలో కేంద్రాల ఏర్పాటు
- పనికిరాని వస్తువులు, సామగ్రి సేకరణ
- ప్రజల నుంచి మంచి స్పందన



మరిపెడ మూడో వార్డులో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం(ఫైల్)

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో పునర్వినియోగ వస్తువుల స్వీకరణకు ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) పేరిట కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపాలిటీలోని 15వార్డుల్లో పనికిరాని వస్తువులు సేకరిస్తున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. వాటిని తమ ఇంటిముందే అందించే విధంగా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చేయడంతో మంచి స్పందన వస్తోంది.

ఏయే వస్తువులు ఇవ్వాలంటే..

ప్లాస్టిక్, వంటసామగ్రి, పనికిరాని పుస్తకాలు, పేపర్లు, పాతదుస్తులు, పాదరక్షలు, ఇనుప సామగ్రి, పరుపులు, దిండ్లు, కుర్చీలు, బల్లలు, మంచాలు, పలు రకాల ఇతర వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అందించాలని ప్రచారం నిర్వహించారు. సేకరించిన వస్తువులకు రశీదు అందిస్తున్నారు. ఈ ప్రక్రియ జూన్ 5వ తేదీ వరకు కొనసాగనుంది.

ప్రజలు సహకరించాలి..



మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో పనికిరాని వస్తువులు అందించి సహకరించాలి. సేకరించిన వాటిని ఆయా సంస్థలకు జూన్ 5వ తేదీ తర్వాత పంపిస్తాం. ప్రజలు తమ ఇంట్లో ఉన్న పనికిరాని ఏ వస్తువైనా అందించవచ్చు. – రాజు, మున్సిపల్ కమిషనర్

1నుంచి ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎంపీఈడీ మూడో సెమిస్టర్ విద్యార్థులకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు జూన్ 1వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. జూన్ 1, 3, 5, 7వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కేయూకు న్యాక్ గ్రేడ్‌పై ఉత్కంఠ!

- సెల్ఫ్ స్టడీ రిపోర్టులో తప్పుడు సమాచారం అంటూ ఆరోపణలు
- న్యాక్ డైరెక్టర్‌కు ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు?
- ఇటీవల పర్యటించిన న్యాక్ బృందం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ గ్రేడ్‌పై ఉత్కంఠ నెలకొంది. మళ్లీ వస్తుందా.. రాదా.. ఒకవేళ వచ్చినా గ్రేడ్ తగ్గిపోతుందా అనేది కేయూలోచర్చ జరుగుతోంది. న్యాక్‌కు పంపిన సెల్ఫ్ స్టడీ రిపోర్టులో కొంత తప్పుడు సమాచారం పొందుపర్చారని ఆరోపణలు వస్తుండడం అధ్యాపకుల్లో, ఉద్యోగుల్లో చర్చగా మారింది. న్యాక్ ఏగ్రేడ్ కలిగిన కేయూ రీ అక్రిడిటేషన్ కోసం అధికారులు ఈ ఏడాది మార్చిలో సెల్ఫ్ స్టడీ రిపోర్టు (ఎస్ఎస్ఆర్)ను నేషనల్ అసెస్‌మెంటు అక్రిడిటేషన్ కౌన్సిల్‌కు పంపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు న్యాక్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్ సహా ఓ మెంబర్, కోఆర్డినేటర్ మరో ఐదుగురు సభ్యుల బృందం క్యాంపస్‌ను సందర్శించి పరిశీలించింది. క్యాంపస్‌లో 28 విభాగాలు, ఆరు కళాశాలలు ఉంటే 14 విభాగాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. పలు విభాగాల్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా న్యాక్ టీం అడిగిన ప్రశ్నలకు అధ్యాపకులు తడబడ్డారని వర్సిటీలో చర్చ జరుగుతోంది. పూర్వ విద్యార్థులతో సమావేశం సందర్భంగా యూనివర్సిటీకి అలుమిని కామన్ రిజిస్ట్రేషన్ ఉందా అని ప్రశ్నిస్తే హాజరైనవారిలో పలువురు తాము పనిచేసిన విభాగాల అలుమిని అసోసియేషన్‌ల గురించి వివరించే యత్నం చేయగా, తాము అడిగింది అది కాదని న్యాక్‌టీం పేర్కొన్నట్లు సమాచారం. కేయూ అభివృద్ధికి సూచనలు సలహాలు ఇవ్వడంలోనూ విఫలమయ్యారని చర్చ. ఇక అధ్యాపకుల సమావేశంలో రెగ్యులర్ అధ్యాపకులు తక్కువమందే హాజరుకావడం, టీచింగ్ స్టాఫ్‌గా ఉన్న డీన్‌లు, బీఓఎస్‌లు, విభాగాల అధిపతులు హాజరుకాకపోవడం.. ఓ పార్ట్‌టైం అధ్యాపకుల సమావేశంలో న్యాక్‌టీం అడిగిన రెండు ప్రశ్నలకు ఓ ప్రొఫెసర్ తప్పుడు సమాధానాలు ఇచ్చారని తెలుస్తోంది.

ఫిర్యాదు..

న్యాక్‌కు పంపిన ఎస్ఎస్ఆర్ రిపోర్టులో తప్పుడు సమాచారం ఇచ్చారని పలు ఆధారాలతో సహా న్యూఢిల్లీలోని యూజీసీ చైర్మన్, న్యాక్ డైరెక్టర్‌కు, తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఈ మెయిల్స్‌ద్వారా ఒకరిద్దరు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. అదేవిధంగా ఈ నెల 27న న్యాక్‌టీం యూనివర్సిటీలో పర్యటిస్తుండగానే అందులో నలుగురి సభ్యులకు కూడా వాట్సాప్ ద్వారా అకుట్ జనరల్ సెక్రటరీగా మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని మామిడాల ఇస్తారి కోరారని సమాచారం. కానీ వారు సమయం ఇవ్వలేదని తెలిసింది.

ఎస్ఎస్ఆర్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారా?

- ఈ ఏడాది మార్చిలో పంపిన సెల్ఫ్ స్టడీ రిపోర్టులో క్యాంపస్‌లో 28 విభాగాలు, ఆరు కళాశాలలున్నట్లు పేర్కొన్నారు. 273మంది అధ్యాపకులు ఉన్నట్లు పొందుపరిచారు.
- క్యాంపస్ కాకుండా అటానమస్ కాలేజీగా ఉన్న ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని సోషియాలజీ విభాగానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్ల రెండు ప్రాజెక్టులు కూడా ఈ ఎస్ఎస్ఆర్‌లో పేర్కొన్నారని ఆరోపణలున్నాయి.
- కేహబ్ నిర్మాణం పూర్తికావస్తుంది. దీనిని కూడా ఎస్ఎస్ఆర్‌లో పేర్కొని న్యాక్ టీంకు కూడా చూపెట్టారు. ఎలాంటి పరిశోధనల పరికరాలు పెట్టలేదు. దీనిని కూడా ఎలా రిపోర్ట్‌లో చూపెడుతారనేది వర్సిటీ అధ్యాపకుల్లో చర్చ.
- ప్రాజెక్టులకు గ్రాంటు రాకున్నా 38 ప్రాజెక్టులకు నిధులు వచ్చినట్లుగా చూపించారు.
- ఐదేళ్లలో 124 పుస్తకాలు పలు విభాగాల అధ్యాపకులు రాసినట్లు చూపించారని, వాటిలో కొన్నింటికి ఐఎస్‌బీఎన్ నంబర్ లేకపోవడంతో న్యాక్ టీం వాటిని పరిగణనలోనికి తీసుకుంటుందా లేదా అనేది చూడాలి.
- పరిశోధన ప్రాజెక్టుల్లో కెమిస్ట్రీ విభాగంలో లేని ఓ ప్రొఫెసర్ పేరుతో ప్రాజెక్టును చూపించారని తెలుస్తోంది.
- ఎస్ఎస్ఆర్ రిపోర్టులో పేర్కొన్న అంశాల ఆధారంగానే న్యాక్ గ్రేడింగ్‌లో 70శాతం మార్కులు ఉంటాయి. మరో 30శాతం న్యాక్ టీం పరిశీలించిన అంశాల ఆధారంగా ఇస్తారు.
- కీలకమైన నివేదికలో ఎందుకు లేనివి ఉన్నట్లుగా పొందుపర్చారనేది ప్రశ్న తలెత్తుతోంది.
- మంచి గ్రేడింగ్ కోసం న్యాక్‌టీంను కూడా తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కేయూకు మళ్లీ న్యాక్ ఏ గ్రేడ్ వస్తుందా లేదా అనేది చర్చగా మారింది.
- కాగా, ఈ ఆరోపణలు న్యాక్‌టీమ్ ఉన్నప్పుడే కేయూ అధికారుల దృష్టికిరాగా చివరి రోజు టీం సభ్యులను కలిసి వాస్తవాలు ఇవీ అంటూ వివరించినట్లు సమాచారం.

పాలక మండలి చర్యలు తీసుకోవాలి

న్యాక్‌కు పంపిన ఎస్ఎస్ఆర్‌లో కొంత తప్పుడు సమాచారం పొందుపర్చి వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీసిన అధికారులపై పాలకమండలి చర్యలు తీసుకోవాలి. ఖమ్మం పీజీ కాలేజీ పనిచేస్తున్న ప్రొఫెసర్ పబ్లికేషన్లను ఎస్ఎస్ఆర్‌లో చూపించడం శోచనీయం. వ్యక్తిగత కక్షలతో అధ్యాపకులను వేధిస్తున్న అధికారుల వైఖరిని మార్చుకోవాలి. ఎస్ఎస్ఆర్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యవహారంలో బాధ్యులైన వారిపై విచారణ కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని అకుట్ డిమాండ్ చేస్తోంది. – మామిడాల ఇస్తారి, అకుట్ జనరల్ సెక్రటరీ

కబ్జాల పర్వం

- జిల్లా కేంద్రంలోని కంబాలచెరువుపై కబ్జాదారుల కన్ను
- చెరువు భూమిలో వెంచర్ల ఏర్పాటు
- ఎన్‌ఓసీ లేకుండానే నాలా అనుమతులు
- కాసుల కక్కుర్తితో పలు సర్వే నంబర్లతో పట్టాలు
- సర్వేతో బయటపడుతున్న వైనం



చెరువు శిఖంలో ఏర్పాటు చేసిన వెంచర్



చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు, బంధం చెరువు, జనాల చెరువుతో పాటు మరో రెండు చెరువులు సగానికిపై కబ్జాకు గురయ్యాయి. అవి కుంటల్లా మారాయి. కాగా ప్రస్తుతం కబ్జాదారులు, రియల్టర్ల కన్ను కంబాలచెరువుపై పడింది. ఇటీవల చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో చాలా వరకు కబ్జాకు గురయ్యాయి. కాగా రియల్టర్లు వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించారు. అధికార పార్టీకి చెందిన నాయకులే నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు చేసి కోట్లు కూడబెట్టుకున్నారు. కాగా ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు సర్వే చేయగా కబ్జాల పర్వం బయటపడింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నష్టపోయే అవకాశం ఉంది.

కొత్త సర్వే నంబర్లు సృష్టించి..

మానుకోట మున్సిపాలిటీ పరిధి రజాలిపేట రోడ్డులో గోశాల సమీపంలో కంబాలచెరువు ఉంది. మొత్తం చెరువు విస్తీర్ణం 130 ఎకరాలు ఉండాలని అధికారులు చెబుతున్నారు. కాగా చెరువు, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కబ్జాలు జరిగాయి. ఆ చెరువు 442 సర్వే నంబర్‌లో ఉండగా.. గతంలో కొంతమంది రెవెన్యూ అధికారులు కాసుకలకు కక్కుర్తిపడి వేరే సర్వే నంబర్లతో ఎఫ్‌టీఎల్, రెవెన్యూ భూమికి కూడా పట్టాలు ఇచ్చారు.

వెంచర్ ఏర్పాటు..

చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్థలం రెండున్నర ఎకరాల్లో వెంచర్ చేసి 90 శాతం ప్లాట్లు విక్రయించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వెంచర్ వేశారు. వెంచర్‌కు ఇరిగేషన్ నుంచి ఎలాంటి ఎన్‌ఓసీ లేదు. కానీ రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నాలా అనుమతి ఇచ్చారు. కేవలం నాలా అనుమతితో ప్లాట్లు చేసి కోట్లు దండుకున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నష్టపోవాల్సి వస్తోంది.

నిర్మాణాలు..

కంబాల చెరువు శిఖం భూమిలో భవనాల నిర్మాణాలు పూర్తి కాగా ప్రస్తుతం మరిన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ హాస్టల్ సమీపంలో కబ్జాదారులు చదును చేస్తున్నారు. త్వరలోనే ప్లాట్లు చేసి విక్రయాలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. మరికొంత మంది శిఖం భూమిలోనే ఫెన్సింగ్ చేసుకుని ఆ భూమి తమదేనని బోర్డులు కూడా ఏర్పాటు చేసుకున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో సర్వే..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే వినతుల్లో ఎక్కువగా భూసమస్యలపైనే ఉంటున్నాయి. దీంతో సర్వే చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సర్వే చేస్తున్నారు. కంబాలచెరువు, బంధం చెరువుల సర్వే పూర్తి చేశారు. కంబాలచెరువు సర్వేలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రధానంగా ఇరిగేషన్ ఎన్‌ఓసీ లేకుండా వెంచర్లు, అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడైంది. త్వరలోనే నోటీసులు పంపి భూమిని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిసింది.

నోటీసులు ఇచ్చాం..

కంబాలచెరువు, బంధం చెరువు సర్వే పూర్తి అయింది. కంబాలచెరువులో చెరువు శిఖం, బఫర్‌జోన్‌లో వెంచర్లు చేశారు. వారికి నోటీసులు ఇచ్చి తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఎన్‌ఓసీ కూడా లేకుండానే రెవెన్యూ అధికారులు నాలా అనుమతి ఇస్తున్నారు. ప్రజలు చెరువు భూములు కొనుగోలు చేయవద్దు. – శ్రావణి, ఇరిగేషన్ ఏఈ

స్వాధీనం చేసుకుంటాం..

జిల్లా కేంద్రంలో కబ్జాలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. కొంత మంది రియల్టర్లు నాలా అనుమతులు కూడా తీసుకోకుండా ప్లాట్లు చేసి విక్రయాలు చేస్తున్నారు. సర్వే పూర్తి కాగా తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయవద్దు. ప్రజలు అర్థం చేసుకొని సహకరించాలి. – ఇమ్మానియేల్, తహసీల్దార్

లేఅవుట్ లేని ప్లాట్లు కొనొద్దు..

జిల్లా కేంద్రంలో అనధికార వెంచర్లు చేస్తున్నారు. వాటిలో హద్దురాళ్లు తొలగించి ఆప్లాట్లను కొనుగోలు చేయవద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాం. ఆ ప్లాట్లకు ఎలాంటి అనుమతులు ఇవ్వం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ఆ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ కాకుండా తగు చర్యలు తీసుకుంటాం. – నవీన్, టీపీఓ

నేటి ప్రజావాణి రద్దు

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నేడు (సోమవారం) జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది గమనించి జిల్లా ప్రజలు వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి, కనీసం 7జీపీఏ సాధించిన విద్యార్థుల నుంచి 2023–24 సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సంక్షేమశాఖ అధికారి సన్యాసయ్య ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఈపాస్.సీజీజీ.గౌట్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 3వ తేదీ చివరి గడువు అని, విద్యార్థులు కుల, ఆదాయం, నివాసం, పదో తరగతి మార్కుల మెమో, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాసుబుక్, దివ్యాంగులు అయితే సంబంధిత ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్లు (4నుంచి 10వ తరగతి వరకు) రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేయాలన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని ఎస్సీ షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో చిరువ్యాపారి మృతి


అబ్దుల్ అజీజ్ (ఫైల్)

మరిపెడ: మానుకోట జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన ఓ చిరువ్యాపారి వడదెబ్బతో మృతిచెందాడు. మున్సిపల్ కేంద్రంలోని పూల బజారుకు చెందిన మహ్మద్‌అబ్దుల్ అజీజ్(40) మండల కేంద్రంలోని అంగడి బజారులో చాలా కాలంగా తోపుడుబండిపై పాన్‌షాప్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ హైదారాబాద్‌లో ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రేపు ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై చర్చ

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఈ నెల 31న చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక అస్థిత్వ, వామపక్ష, రైతాంగ పోరాటాలతో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేకత ఉందని, పోరాటాలకు పురిటిగడ్డ అని ఆయన వివరించారు. సమైక్యాంధ్ర రాష్ట్రంలో ఐదో జోన్‌గా కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్, వరంగల్ జిల్లాలకు పరిపాలన కేంద్రంగా 60 సంవత్సరాలు కొనసాగిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ వరంగల్‌ను రెండో రాజధానిగా గుర్తిస్తామని అనేక సందర్భాల్లోనూ, వరంగల్‌లో జరిగిన సభల్లోనూ చెప్పారని గుర్తు చేశారు. వరంగల్ జిల్లాను ఎక్కడా లేని విధంగా 6 జిల్లాలుగా విభజించి ముక్కలు చేశారని తెలిపారు. ఈ క్రమంలో గత 9 సంవత్సరాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన అభివృద్ధిపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31న ఉదయం 10 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఫోరం ఫర్ బెటర్ వరంగల్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక సంయుక్తంగా ఈ చర్చాగోష్టి చేపట్టిందని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉద్యమకారులు, ఆలోచనాపరులు ఈ చర్చలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమగ్ర వికాసానికి శాలసిద్ధి

- అభివృద్ధే లక్ష్యంగా పైలట్ ప్రాజెక్ట్‌గా 30 స్కూల్స్ ఎంపిక
- ఏడు ప్రధాన క్షేత్రాలు.. 138 అంశాలతో కార్యక్రమం
- పాఠశాలల పునఃప్రారంభం అనంతరం ఉత్తర్వులు

NATIONAL PROGRAMME ON SCHOOL STANDARDS AND EVALUATION (NPSSE)
शाला सिद्धि
Shaala Siddhi


శాలసిద్ధి వర్క్ షాప్‌లో నివేదిక చదువుతున్న జిల్లా అధికారులు (ఫైల్)

కాళోజీ సెంటర్ : విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభావవంతమైన పాఠశాలలు అవసరం. పాఠశాలలో చేపట్టే నాణ్యతా చర్యల లక్ష్యం పాఠశాల అభివృద్ధిని సాధించేందుకు ఒక సమగ్ర, సంపూర్ణ మూల్యాంకన విధానాన్ని ఏర్పరచడం అవసరం అని భావించి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ పాఠశాల ప్రణాళిక, పరిపాలనా సంబంధ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఈపీఏ) ఆధ్వర్యంలో పాఠశాల ప్రమాణాలు మూల్యాంకనం కొరకు జాతీయ కార్యక్రమం (ఎన్‌పీఎస్‌ఎస్‌ఈ) చేపట్టింది. ప్రతి పాఠశాలను ఒక వ్యవస్థగా మూల్యాంకణం చేయడం, జవాబుదారీతనంతో స్వతహాగా ముందడుగు వేసే సంస్కృతిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టబడింది.

జిల్లాల వారీగా ప్రభుత్వ పాఠశాలల వివరాలు ఇలా..

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత
హనుమకొండ	314	72	147
జే.ఎస్.భూపాలపల్లి	319	159	68
జనగామ	341	64	103
మహబూబాబాద్	676	120	102
ములుగు	266	45	40
వరంగల్	460	65	125

పాఠశాలల అభివృద్ధే లక్ష్యం..

పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా శాలసిద్ధి కార్యక్రమం చేపట్టబోతుంది. పాఠశాల సమగ్ర స్వరూపం బలాలు, బలహీనతలు వెల్లడించే సమగ్ర దర్పణంగా శాలసిద్ధి కార్యక్రమాన్ని పరిగణిస్తున్నారు. గతంలో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఉపాధ్యాయుల సహకారంతో ఏడు ప్రధాన క్షేత్రాల, 46 కీలక ప్రమాణాలు తదితర సమాచారన్ని ప్రభుత్వ అధికారులకు పంపేవారు. కానీ శాలసిద్ధిలో పొందుపరిచిన వివరాలకు జరుగుతున్న అభివృద్ధికి పొంతనలేదని గ్రహించిన విద్యాశాఖ శాలసిద్ధి కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం పకడ్బందీగా నిర్వహించి సరైన వివరాలను సేకరించే పనిలోపడింది. ఇందులో భాగంగా మొదటి విడతలో వరంగల్ జిల్లాతోపాటు 16 జిల్లాల నుంచి ఏడుగురు ప్రతినిధులతో టీఎస్‌ఐఆర్డీ రాజేంద్ర నగర్ హైదరాబాద్‌లో మూడు రోజుల వర్క్ షాప్‌ను ఈనెల 9 నుంచి 11 తేదీ వరకు నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో చర్చించబడిన అంశాల దృష్ట్యా ప్రతి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తమ వనరులను పరిశీలించి, పాఠశాల అభివృద్ధికి లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటిని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. తన పాఠశాల నేడు ఏ స్థాయిలో ఉంది..? అత్యున్నత స్థాయికి వెళ్లాలంటే ఎలాంటి కార్యచరణ అమలు చేయాలనేది నిర్ధారించుకోవాలి. దీనికి గాను పాఠశాల సిబ్బంది ఒక విజన్ స్టేట్మెంట్ తయారు చేసుకొని దానిని సాధించడానికి మిషన్ స్టేట్‌మెంట్స్ తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాన క్షేత్రాలపై అవగాహన పెంచుకొని పాఠశాల సమగ్ర అభివృద్ధి ప్రణాళి రచన చేయాల్సి ఉంటుంది.

లక్ష్యాల ఏర్పాటు కోసం..

శాలసిద్ధిలో ఏడు ప్రధాన క్షేత్రాలకు సంబంధించిన 138 అంశాలకు సరిపోయే వివరాలను శాలసిద్ధి పోర్టల్‌లో పొందుపరచాలి. 2023– 24విద్యా సంవత్సరంలో పైలట్ స్కూల్స్‌గా కేవలం 30 పాఠశాలలను మొదటి దశలో ఎంపిక చేసి మూల్యాంకనం చేస్తారు. అందులో 10 ఉన్నత పాఠశాలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలలను.. ఇందులోనూ.. విద్యార్థుల సంఖ్య అత్యధికంగా ఉన్న పాఠశాలలను మాత్రమే ఎంపిక చేస్తారు. ఆయా పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయుడికి జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులు తగు సూచనలు ఇస్తారు. వీరు సేకరించిన వివరాలు సరిచూసుకొని పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ శాలసిద్ధి కార్యక్రమంపై ఈనెల 26న టీఎస్‌ఐఆర్డీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలల డీఈఓలకు అవగాహన కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. త్వరలో పాఠశాలల పునఃప్రారంభం తర్వాత శాలసిద్ధి మూల్యాంకనంపై అధికారిక ఉత్తర్వులు వెల్లడి కావాల్సి ఉంది.

శాలసిద్ధిలో ఏడు ప్రధాన క్షేత్రాలు..

- పాఠశాలకు అవసరమైన వనరులు, వినియోగం.
- బోధనాభ్యాసన, మదింపు
- విద్యార్థుల ప్రగతి సాధన, అభివృద్ధి
- ఉపాధ్యాయుల పనితీరు, వృత్తిపర అభివృద్ధి నిర్వహణ
- పాఠశాల నాయకత్వం, నిర్వహణ
- సమ్మిళిత విద్య ఆరోగ్యం, భద్రత
- ఉపయుక్తమైన సమాజ భాగస్వామ్య తదితర అంశాలు

కచ్చితమైన సమాచారం ఇవ్వాలి



స్కూల్స్ పునఃప్రారంభమై.. శాలసిద్ధి అమలుకు ఉత్తర్వులు వెలువడగానే ఎంపిక చేయబడిన పాఠశాలలు కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు సరైన అవగాహనతో సమాచారం అందించాలి.

– వాసంతి, డీఈఓ వరంగల్

అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

శాలసిద్ధి పాఠశాలలు సమగ్ర వికాసానికి దోహదపడే కార్యక్రమం. ఈ కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు పాలు పంచుకొని పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

– సారయ్య, వరంగల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

- రీజనల్ మేనేజర్ బయ్యా రఘు

మడికొండ: రైతులకు వానాకాలం సాగుకు కావాలసిన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వరంగల్ జిల్లా రీజనల్ మేనేజర్ బయ్యా రఘు ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు ప్రకటించారు. వీటిలో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వం 65 శాతం రాయితి ప్రకటించినట్లు రఘు తెలిపారు. అందుబాటులో ఉన్న మండల వ్యవసాయధికారి వద్ద అనుమతి తీసుకొని వ్యవసాయధికారి కార్యాలయంలో.. లేదా.. మన గ్రోమోర్, పీఏసీఎస్ సొసైటీల్లో రైతులు కావాల్సిన విత్తనాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

విత్తన రకం	పూర్తి ధర	సబ్సిడీ	సంచి బరువు	రైతు ధర(క్వింటాకు)
జీలుగ	రూ.8,025	రూ.5,216	30కిలోలు	రూ.2,809
జనుము	రూ.8,750	రూ.5,688	40కిలోలు	రూ.3,062
పిల్లిపెసర	రూ.10,050	రూ.6,533	20కిలోలు	రూ.3,517

వరి విత్తన రకం	అందుబాటులో ఉన్న విత్తనాలు	సంచి బరువు	ధర
యంటుయు1010	10వేల క్వింటాళ్లు	25కేజీలు	రూ.882.50
కేఎన్ఎం1638	500 క్వింటాళ్లు	25కేజీలు	రూ.882.50
జేజీఎల్24423	500 క్వింటాళ్లు	25కేజీలు	రూ.882.50
బీపీటీ5204	10వేల క్వింటాళ్లు	25కేజీలు	రూ.887.50
ఆర్ఎన్ఆర్15048	2వేల క్వింటాళ్లు	25కేజీలు	రూ.912.50
డబ్ల్యుజీఎల్962	500 క్వింటాళ్లు	25కేజీలు	రూ.882.50
కేఎన్ఎం118	6వేల క్వింటాళ్లు	25కేజీలు	రూ.882.50

విత్తన రకం	నిల్వలు	సంచి బరువు	ధర
కంది–పీఆర్‌జీ 176	300 క్వింటాళ్లు	2కేజీ	266
పెసర్లు(ఎంజీజీ–295)	500క్వింటాళ్లు	2కేజీ	216.20
మినుములు(పీయూ–31)	100క్వింటాళ్లు	2కేజీ	212
వేరుశనగ(కే–6 లేపాక్షి)	500క్వింటాళ్లు	30కేజీలు	2,707.50
మొక్కజొన్న(డీహెచ్‌ఎం117)	50క్వింటాళ్లు	5కేజీ	600



అజర ఆస్పత్రికి కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అనుమతి


అజర హాస్పిటల్

ఎంజీఎం : నగరంలోని ములుగు రోడ్డులోగల అజర హాస్పిటల్స్‌కు ఉత్తర తెలంగాణలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ హాస్పిటల్‌గా ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన మానవ అవయవ మార్పిడి కమిటీ విభాగం చైర్మన్ ఆస్పత్రి యాజమాన్యానికి అనుమతి మంజూరు సర్టిఫికేట్ జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రజలకు మొదటిసారిగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వైద్యం అందుబాటులోకి వచ్చినట్లు అయింది. ఈ సందర్భంగా అజర హాస్పిటల్స్ ఎండీ శివసుబ్రమణ్యం మాట్లాడుతూ.. తమ హాస్పిటల్స్‌కు కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అనుమతి రావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలి


మాట్లాడుతున్న బందెల వెంకటరాజం

హసన్‌పర్తి: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని ఆసంఘం రాష్ట్ర జేఏసీ కన్వీనర్ వెంకటరాజం డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల ఉమ్మడి జిల్లా సదస్సు ఆదివారం హసన్‌పర్తి మండల పరిషత్ సమావేశపు మందిరంలో నిర్వహించారు. ఈసమావేశంలో వెంకటరాజం ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ పంచాయతీ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం జీఓ నంబర్ 60 ప్రకారం సఫాయి, స్వీపర్లకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లకు రూ.19,500 వేతనం ఇవ్వాలన్నారు. పంచాయతీ సిబ్బంది అందరికీ రూ.10లక్షలు బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 51ను సవరించాలని కోరారు. గ్రామపంచాయతీలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర జేఏసీ కోశాధికారి చాతళ్ల సదానందం అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు శ్రీధర్, రాజుగౌడ్,రామ్మూర్తి, సునీత, రేణుక, శివ, రమేష్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటివద్ద బాధితులు

దంతాలపల్లి: మానుకోట జిల్లా దంతాలపల్లి మండల కేంద్రం జంగాల బజారులో ఆదివారం మధ్యాహ్నం సమారు 12 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైంది. కాలనీ వాసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బచ్చోడు గ్రామానికి చెందిన నర్కిటి హుస్సేనమ్మ తన భర్త పెద్దవెంకటస్వామి చనిపోవడంతో 8 సంవత్సరాల క్రితం ఇక్కడికి వచ్చి పూరి గుడిసే నిర్మించుకొని ఉంటుంది. ఆదివారం హుసేన్నమ్మ కుమారుడు భాస్కర్ భార్యతో కలిసి వేరే ఊరికి వెళ్లారు. ఈక్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటినుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పారు. మంటల్లో రెండ్లు ఇళ్లు దగ్ధం కాగా.. గృహోపకరణాలు, రూ.6.50 లక్షలు, ఐదున్నర తులాల బంగారం, ఓ ద్విచక్రవాహనం, టీవీ దుస్తులతోపాటు నిత్యావసర వస్తువులు కాలిపోయాయి.

క్యాబిన్‌లో ఇరుక్కుని నరకయాతన


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ నరేష్

టేకుమట్ల(రేగొండ): రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో ఓ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుని నరకయాన అనుభవించిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం నుంచి ఇసుక లోడుతో హనుమకొండ వైపు వెళ్తున్న లారీకి రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లిలో ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో లారీ వేగాన్ని తగ్గించడంతో వెనకాలే వస్తున్న మరో లారీ వేగాన్ని నియంత్రించలేక, ముందు ఉన్న లారీని వేగంగా ఢీ కొట్టింది. దీంతో జనగామ జిల్లా దేవరుప్పుల మండలా నికి చెందిన లారీ డ్రైవర్ నూకల నరేష్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. సమాచారం అందుకున్న పోలీ సులు స్థానికుల సాయంతో అతన్ని బయటకు తీసి చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నాడని..

- ఆత్మహత్యకు పాల్పడిన డిగ్రీ విద్యార్థి
- మూడు రోజులకు వెలుగుచూసిన మృతదేహం


సాయితేజ (ఫైల్)

రఘునాథపల్లి: ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దని తండ్రి మందలించడంతో ఓ డిగ్రీ విద్యార్థి మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం చిన్న కందుకూర్ గ్రామానికి చెందిన నమిలె పాండు కుమారుడు సాయితేజ (21)భువనగిరిలోని ఓ కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. సాయితేజ కొన్నాళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల్లో కూరుకుపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి ఈనెల 25న ఆన్‌లైన్ గేమ్ ఎందుకు ఆడుతున్నావని కుమారుడిని మందలించాడు. దీంతో అదే రోజు సాయితేజ ఇంటినుంచి ద్విచక్రవాహంపై వెళ్లిపోయాడు. కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెనకాల రైల్వేట్రాక్ సమీపంలో చూడగా వేప చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్న సాయితేజ మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉండగా.. పక్కనే ఉన్న ద్విచక్రవాహనం సాయితేజదిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సాయితేజ ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకోవడం, విషయం తండ్రికి తె లిసి మందలించడంతో మనస్తాపంతో ఆత్మహత్య కు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. తండ్రి పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

వృద్ధుడికి అండగా పోలీసులు


వృద్ధుడిని ఇంట్లోకి చేర్చుతున్న పోలీసులు

రాయపర్తి: ఓ వృద్ధుడిని విస్మరించిన కుటుంబానికి పోలీసులు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి చేర్చారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని చిన్నాల కొమురయ్య(85) ఇదే గ్రామానికి చెందిన రాజమ్మతో వివాహం జరుగగా ఇల్లరికం ఉన్నాడు. ముగ్గరు బామ్మర్దులతో సమానంగా ఆరు ఎకరాల వ్యవసాయభూమిని పట్టా చేశారు. ఐదేళ్ల కిందట భార్య రాజమ్మ మృతి చెందగా వీరికి పిల్లలు లేకపోవడంతో బామ్మర్దులు అంతతామే చూసుకుంటామని కొమురయ్యకు చెందిన భూమిని తిరిగి తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఇంటినుంచి గేంటేసి అంగడీ ఏరియాలో బస్తాలతో కూడిన గుడిసెలో వేసి వెళ్లారు. విషయం వర్ధన్నపేట సీఐ మదన్‌మోహన్‌కు తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధునికి కావాల్సిన సపర్యలు చేసి ఆయన ఇంటికి చేర్చారు. కాగా బామ్మర్దులు చందు పెద్దసాయిలు, కొమురయ్య, పర్వతాలకు కౌన్సిలింగ్ ఇచ్చి వృద్ధుడి బాగోగులు విస్మరిస్తే చట్టపరంగా చర్యలు అనివార్యమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంపత్, రవీందర్, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

అక్కాతమ్ముడిని ఆదుకోండి..

- తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన పిల్లలు
- పూటగడవని స్థితిలో పేదబిడ్డలు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు




దాతల సాయం కోసం వేడుకుంటున్న అంజలి, రాంచరణ్

కాటారం: తల్లిదండ్రులతో కలిసి అల్లారుముద్దుగా గడపాల్సిన వయస్సు. కన్నవారు ఆలనాపాలనా చూస్తుంటే.. ఆనందంగా సాగాల్సిన వారి జీవనం పూటగడవని స్థితిలో దీనంగా సాగుతోంది. ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయి.. నా అనే వారు లేక దిక్కుతోచని స్థితిలో ఆదుకునేవారి కోసం ఎదురుచూస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికి చెందిన అక్కాతమ్ముళ్లు అంజలి, రాంచరణ్ తల్లిదండ్రులు వల్లంకొండ సమ్మయ్య–సుమలతలు ఉన్నంతలో పిల్లలు ఏ ఇబ్బంది లేకుండా పెంచుతున్నారు. ఈక్రమంలో విధి వక్రించింది.. సమ్మయ్య అనారోగ్యంతో మంచం పట్టి రెండేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి సుమలత ఓ రేకులషెడ్‌లో ఉంటూ పిల్లలను పోషించింది. ఓ పక్క పిల్లల బాధ్యత భారంగా మారడంతో పాటు భర్త లేడనే వేదన సుమలతను కృంగ తీయడంతో తాను కూడా అనారోగ్యం పాలైంది. గత ఏడాది మే 19న సుమలత మృతి చెందింది. ఏడాది వ్యవధిలో తల్లి, తండ్రి మృత్యువాతపడటంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. అంజలి పదో తరగతి వరకు చదివి మానేయగా రాంచరణ్ 8వ తరగతి చదువుతున్నాడు. ఇన్నాళ్ల పాటు ఎలాగో ఒకలా కాలం వెళ్లదీసిన అక్కాతమ్ముడికి ప్రస్తుతం గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక కనీసం తినడానికి సరైన తిండి లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఎవరూ లేకపోవడంతోపాటు ఇల్లు కూడా సరిగాలేకపోవడతో నరకాన్ని చూస్తున్నారు. దాతలు ఎవరైనా ఆదుకోవాలని ఆపన్న హస్తం కోసం వేడుకొంటున్నారు.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 84979 86948, 96181 16018

వివాహిత ఆత్మహత్య

గార్ల(డోర్నకల్): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముల్కలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. మానుకోట జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన బానోత్ పద్మ(28) భర్త రవి తరచూ మద్యం సేవిస్తూ భార్యతో ఘర్షణ పడుతుండేవాడు. దీంతో పద్మ జీవితంపై విరక్తి చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్– కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, వైట్ కలర్ ఫుల్ షర్ట్, బనియన్, బ్లూ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. వివరాలు తెలిసినవారు హెడ్ కానిస్టేబుల్ రాజును లేదా.. 94415 57232, 94406 27532 నంబర్ల ద్వారా సంప్రదించాలని సీఐ సూచించారు.